


శ్రీ ద్వివేదుల సోమనాథశాస్త్రి

"ఏవునే! వెంకమ్మా! కోతింటి వాళ్ల కోడలింకా వుందిటే?"

"ఉందమ్మా. వాళ్లుంచదానికి యిష్టపడ్డారు కాదోలు - వీళ్లుంచుకున్నారు. ఏమో మనకేం తెలుసు!"

'అయినా రెండు నెల్లు కావొస్తోంది కదుటే- యింకా అలా కార్యం కాని పిల్లని అత్తారింట్లో వదిలేస్తారే!'

"ఏమో ఎందుకుంచేరో మనకేం తెలుస్తుంది!- మరి- ఆవిడకి ఆడసంతానం లేదుగా అందుకని ముచ్చటపడి - బొమ్మల కొలువులకీ అట్ల తదయికీ వుంచుకొని వుంటుంది!"

'ఎంత' యిది లేకపోయినా కోడలిని ఉంచుకుంటారే! అందులోనూ ఎదిగిన పిల్లని!'

"అయితేనేం లే, మొగుడూ పెళ్లాలే కమా, తప్పేమిటి? వాళ్ళ కిష్టమయింది వుంచుకున్నారు. మధ్య నీకూ నాకూ ఎందుకీ గోవ?"

"ఆc! అలా అని ఊరుకుంటుందా లోకం! పెద్దలనీ- ఇరుగనీ, పొరుగనీ- ఎందుకున్నారు?... నువ్వేమంటే అను. మనకాలంలో సంవత్సరాడినతర్వాత అత్తారింట్లో ఎన్నడైనా యిన్నాళ్లుండి ఎరిగామే?... మరీ చోద్యం కాకపోతే'-

"ఆc! మనకాలం!!- మన చిన్నతనంలో మాత్రం లేరటే? ఆ సీత ఏమిటి చేసింది?... కార్యం కాకముందే అత్తారింట్లో వుండి కడుపు దించుకోలేదూ?"

"ఉన్నా... నూటికో! కోటికో!... ఇంతలా ఉండేదా? ఇంతకీ ఆపిల్ల పుట్టింటారెందుకుంచేరో - యిన్నాళ్లు ఎవరైనా అనుకుంటారన్న యిదైనా లేకుండా ఏంలాసుగుందో ఏమో?"

"సరదాగా యీరెండు నెల్లూ ఉంచుకుంటాం అంటే ఏమంటారే... ఉంచక... ఎప్పటికైనా వీళ్లలో వుండవలసిందే కదా... యింకేం లాసుగూ?"

"పిల్ల అలా వుందనా! ఏమో! అక్కడేం పితూరీ చేసి వచ్చిందో! మొగుడి మీద రుద్దవచ్చని వుంచేసి వుంటారు!..."

"రామ! రామ!! ఆపిల్ల అలా కనపడదే... ఏమిటలా అంటావు?"

"అన్ని వేషాలూ వేస్తారు మనదగ్గర... ఏదో సామెత చెప్పినట్టు... ఏమైనా నాకనుమానమే సుమా... లేకపోతే అలా రాత్రి మూడుగంటలకి కొళ్ళాయికని వెళ్ళిపోతుంది! యింట్లో కొడుకుని కోడల్నీ వదిలేసి- మరి యింట్లో ఎవరూ లేరాయె! ఎంత మంచివాళ్లైనా... ఎంత భయస్తులైనా అలాంటప్పుడు వూరుకుంటారే!... ఏమంటావు?"

"ఏమో మనం చూసొచ్చామేంటి?- అనుకుందికి! వాళ్లలాటి వాళ్లో-అయినా అంత రాత్రప్పుడు వాళ్లకి తెలివి రావద్దూ?... వచ్చినా తెగించి మాటాడుకోవద్దూ?..."

"మాటాడుకోక ఏంజేస్తారూ?... అది మాటాడకపోయినా... వాడూరుకోడు..."

"ఇస్ వూరుకుందూ...మనకెందుకు!... గోడలకి చెవులుంటాయి!- వింటే మన మీద విరుచుకు పడతారు..."

"ఆc! లోకసహజం అనుకున్నాం... ఏం... మనమేం వాళ్లని చెడిపోమని కోరతామా?"

"లేదుగాని, మనకెందుకు?... అదీ కాక మొగుడూ పెళ్లాలు...వాళ్లేం చేసినా తప్పులేదు. తప్పని ఎవరూ అనలేరు. అలాంటప్పుడు నువ్వూ నేనూ ఉరి పోసుకు చావడం దేనికీ"-

"తప్పని ఎవరన్నారు?.... ఏదో పెద్దలు కార్యం కానిదే- కూడదని చెప్పేరు.

అంతవరకూ వుంటే వీళ్ల కొంపేం మునిగి పోయిందని ?"

"వాళ్లున్నారో లేదో- వుంటారో- వుండరో,- మనకేం తెలిసి ఏడ్చిందటే- లేక మనం చూశామా వాళ్ళిద్దరూ కలిసి వుండడం. అనవసరంగా ఎందుకనడం వాళ్లని... వాళ్ల మానాన్ని వాళ్లుంటేను."

"ఊఁ, వూరుకో వే నరిసి! ఆవిడ వస్తోంది!"

"రావో, లక్ష్మమ్మా! రా, కూర్చో. భోజనం అయిందా!"

"ఆఁ! అయిందమ్మా ఇప్పుడే."

"ఏమిటివి వంటకాలు?"

"ఏదో- వంకాయకూర. పులుసు. కొబ్బరి పచ్చడి"-

"రెండు ఒత్తులు చేసిపెడుదూ, లక్ష్మమ్మా నువ్వు కుద్దిరంగా చేస్తావు"

"అయ్యో దానికేం ?... లెండి. చేస్తా"-

"....యింకేం ? మన లక్ష్మమ్మ- మరి- మనవైపే చూడదు. కొడుక్కి వుద్యోగం అనగానే ఏ కొసకో వెళ్ళిపోతుంది ?"

"కోడలుకూడా యిక్కడే వుందిగా! కార్యం ఎప్పుడూ ?"

"ఉందమ్మా. మొన్న నేకదూ వుష్టం దిగజారింది ? వెంటనే- ఆ మన్యం వూరు పంపించేస్తే తిరగ- వేస్తుందని వుంచేసేం. అట్లతదియ వెళ్లగానే పంపించేస్తాం. నాకూ కూతురైనా కోడలైనా అదేగా మరి! యింట్లో యిం రెడు బొమ్మ లున్నాయి, ఏంచేసుకోను ? పోనీ వూరుకోవడం దేనికని కోడల్ని దసరాకి వుంచేసేను."

"అవునమ్మా, అవును ! చారెడు పసుపూ కుంకంతో కోడలు యింట్లో వుంటే! యింటికి కళ- వుండగా మానుకోవడం దేనికి ? మంచిపని చేశావు !!"

"పోనీ, ఏలాగో యిన్నాళ్లుంది. ఆ. దీపావళి వెళ్లగానే సమ్మ్రంచెయ్య కూడదూ? సరదా పడుతుంది."

"ఎందుకమ్మా! ఆ తర్వాత ఎలాగూ మన దగ్గరే ఉంటుంది. యీనాల్గురోజులకీ మాట పడ్డం దేనికి ?"-

"మాట దేనికమ్మా! కోడల్ని నాల్గు రోజు లుంచుకొంటే తప్పా !! పరాయిదా ఏమేనా. ఏమే, వెంకమ్మా!"

"అవునమ్మా అవును ! ముద్దూ ముచ్చట్లూ తీరొద్దూ !! పెద్దయింతర్వాత ఎద్దుల్లా ఏంబావుంటుందీ !!!"

"ఏమోనమ్మా! యిప్పటికే అందరూ గుసగుసలాడుతున్నారట! నిష్ఠూరం కూడాను. తోలేస్తే తీరిపోతుంది."

"ఆఁ, ఎవరమ్మా! అంటారు! కోడలే కాని పరాయి పిల్ల కాదు. అయినా అండానికి నోరెలా వస్తుందీ!! వచ్చేది కార్తీక మాసం. పూజలూ, పునస్కారాలూను- వాళ్ళింట్లో యివన్నీ తీరుతాయా, ఏమన్నానా? ఆ కాస్తా అయిన తరవాత పంపవచ్చు. అందరిలోనూ కలిసి మెలిసే పిల్ల వెళ్ళిపోతే వీధి చిన్నబోతుంది !!"

"యిన్నాళ్లూ వుంచిన తర్వాత యింకా వుంచమంటే బావుంటుందా! మనకు మాత్రం నోరు రావద్దూ? వాళ్లు రాగానే పంపించేస్తాను."

"పోనీండి. అంతవరకూ కాకపోయినా యీ అట్లతదియ వెళ్లే వరకేనా వుంచక పోతే ఒప్పుకోకండి!"-

"అదెలాగో అవుతుంది లెండి. ఆ తర్వాతే పంపిస్తాం."

'అప్పుడే వెళ్ళిపోతున్నారేం?- కూర్చోండి!'

'లేదమ్మా..యింట్లో బోలెడు పనివుంది. మళ్ళీ వస్తాను లెండి!"

★

"అమ్మడూ కూతుర్ని యింకా తీసుకు రావేంటి ?" అన్నాది దీర్ఘంతీస్తూ రామలక్ష్మితో ఓ బోడమ్మ.

"తీసుకు వచ్చేస్తామండీ...... రేపో ఎల్లుండో" అన్నాది రామలక్ష్మి.

"అదేమిటమ్మా! ... మరీ నీ... యిన్నాళ్లుంచుకోవడం ఏమిటీ ?...వాళ్లకెంత సిగ్గ లేదూ !..."

"సిగ్గేమిటండీ!...వాళ్ళ కోడల్ని ఉంచుకుందికి ?...అదేవిటి అలా అంటారు ?"

'కాదమ్మా... ఎంత కోడలయినా కార్యం కాక ముందు అన్నాళ్లుంచుకోవడం - మంచిదేనా ?... అయినా మీ రెందు కూరుకున్నారూ... ?"

"వచ్చేవన్నీ....ఆడ వాళ్ల పండుగలు- ముద్దూ ముచ్చటాను....యిక్కడికొస్తే చాకిరీయేకదూ ? అక్కడున్నట్టు అవుతుందా ? అందుకని వుంచేశాం... దూర సమ్మంధంకూడా కాదు. మా పిన్ని... కాదన గలమా ?"

"బాగుందమ్మా...బావుందీ...ఖులా అవబట్టే- కాలం యిలా ఏడుస్తోంది. ఎవరు చేసిన పని వారికి మంచిదే.... కాని లోకం ఒప్పుకుంటుందా ? కార్యం- చేసెయ్యకూడదూ ? తీరిపోతుంది!"

"చెసేస్తా మండీ...మనకేం బరువా ? కుర్రాడు చదువుకుంటున్నాడు... తొందరేం ?"-

"అలా అయితే యిలా వుంచకూడదమ్మా- మీరు చిన్న వాళ్లు మీకు తెలీదు-"

"అంతమాత్రంలో మాకు తప్పేమీ కనపడలేదు. అయినా మొగుడూ- పెళ్లాం. తప్పేమిటి ?"

"సరి ! మీరే యిలా అంటే యింకే ముందీ. శాస్త్రాలనీ - పురాణాలనీ...ఎందుకున్నాయీ ? తగలడనా ?"

"ఇక్కడే మూలుగుతూ, మూలుగుతూ వెళ్ళి అక్కడ యిరవై రోజులు లేవలేదట! మొదటినోము ఎలాగో చెంబెడునీళ్లు పోసి అయిందనిపించారట. తక్కిన రెండు నోములకీ జ్వరమేనట! వెంటనే దిగపెట్టేస్తే, ఏమౌతుందో అని నాల్గురోజులపాటు వుంచేరు. యింతలో అట్లతదియ వచ్చింది! యింకెలా తీసుకువచ్చేయడం? అందుకే యిన్నాళ్ళయింది. లేకపోతే మేం మాత్రం ఎందుకు చేస్తాం ?"

"అదేమిటమ్మా ? రెండు నెల్లు కావస్తాంటేనూ."

"అబ్బ! చెప్పేదంతా ఏమిటండీ ! ఉష్ణంతో పడుకుందంటేను."

"అవునమ్మా. ఏదో చెబుతారు మరి ! యింట్లో చేసుకోలేక కోడల్ని వుంచేసుకొని వుంటుంది!"

"పోనీండి. ఎలాగో ఒకలాగ. వాళ్ల అత్తారింటే ఉంది కాని పైయింట్లో లేదు. కొంప మునిగిం దేముందీ ?"

"సరే. ఎప్పుడో తీసుకువస్తారు. తీసుకురాక ఏంచేస్తారూ ?" యింతకీ మాకేం మధ్యనీ. చెప్పవలసింది చెప్పేం. పెద్దవాళ్లు చెప్పేరు కూడదని! అయినా, యిప్పుడెవరూ పాటిస్తేనా ? న్యాయంగా అయితే కార్యం అయేవరకూ పిల్ల అత్తారింట్లో పొయ్యి ముట్టుకో నేకూడదు! అవన్నీ పోయాయి. ఆ కాలం మరి చూడం."

"సరే అవన్నీ ఎందుకు లెండి ! మాట కంటాను. ఏమీ అనుకోకండి!! మీ చెల్లెలి మొగుడు పోయాడుకదా. మరి మీ చెల్లి, చీరెలు కట్టడం మానిందా ? గాజులు వేసుకోవడం మానిందా ? రవికలు తొడగడం మానిందా ? ఏమిటి మానింది ! చెప్పండి ! దేనికదే- వుంది." అని రామలక్ష్మి అనే సరికి ఆ బోడమ్మకి కొంచం కోపం వచ్చింది.

"అవునమ్మా. కాలంతోపాటు మనమూను. వెళ్లొస్తాను."

"సరేలెండి. సాయంత్రం- పురాణానికి వస్తారుకదూ !"

★

"చూశావా అక్కయ్యా, నే చెబితే విన్నావా ? నల్గురూ ఎలా అనుకొంటు

స్నారో." అన్నాడు రామలక్ష్మి తమ్ముడు.

"అనుకోనీరా, ఫరవాలేదు. మరేం వుండబట్టకపోతే సరి!" అంది రామలక్ష్మి చిరాకుతో.

"అవునవును! ఎంత చెప్పినా అంతే. వాళ్ల దగ్గరనుండి అమ్మాయికి నెల తప్పిందని శుభవార్త వస్తేనే గాని తీసుకు రాను. నాకేం!" అన్నాడు.

ఈమాట వినేసరికి రామలక్ష్మికి మనస్సు చివుక్కుమంది- సిగ్గులేకండా అంతమాట తన తమ్ముడే అంటాడని అనుకోలేదు-

"బావుందిరా, తమ్ముడూ! అందరూ నీలాగే వుండరు! నాల్గురోజు లాలస్యం అయేసరికి నానామాటలూ అనుకోవడం! మహా బుద్ధిమంతుడులా చెబుతున్నావు. జ్ఞాపకం తెచ్చుకో!- మనవూళ్లో- తోటకాపలా వాడతోనని పక్కయింటి అమ్మాయిని పట్టుకు వెళ్లాడలేదూ? ఎవరికి తెలీవు బుద్ధులు! దానికన్నా తప్పా ఏమిటిది? ఒక్కవేళ ఏమయినా కూతురూ, అల్లుడే. మరేం పర్వాలేదులే."

అని కోపంతో అనేసింది. అది విని నోరెత్తకండా 'రావు' వెళ్లిపోయేడు.

స్వవిషయాలు లోకానికి యింత భారంగా వున్నాయని ఆమెకు తెలియదు. యిదంతా విన్నతర్వాత వియ్యపురాలింటికి ప్రయాణమయింది.

"రామలక్ష్మి కూతురు బయటుందిటే, రావమ్మా!"- అంది సుబ్బమ్మ.

"ఆ. ఏమిటే? నిజమే? అది బయటుండడం ఏమిటే? నే నమ్మను సుమీ." అంది రామమ్మ."

"అయ్యో... నే చూసొస్తేనే!"

"ఆఁ! మనం ఏమనుకుంటామో అని దాన్ని పైని కూర్చోపెట్టి వుంటారు.",

"లేదు నిజంగానే. తెలుస్తూంటేనే!"

"అయితే ఏమీ లేదు కాబోలు. వుట్టినే అనుకున్నారు అందరూను."

"వుట్టినే ఎందుకనుకుంటారు! అయినా ముట్టు అయినంతమాత్రంలో... కాలేదనా!! ఏమో ఎవరికి తెలుసు! మన మీనాక్షిలా ముట్లయినా కంటుందేమో!!" అని కామమ్మ అంది యిటూ అటూ ఎవరూ లేకండా చూసి.

"ఏమో అదీ నిజమే"- అన్నారు అందరూ కడుపుబ్బ తీరక-

ఈమాటలన్నీ ఆ పక్కనుండి వింటున్న రామలక్ష్మి- "యింకా వీళ్ల అనుమానం తీరలేదా!" అని అనుకుంది ★



కేంద్రం రాష్ట్రాలకొరకు, రాష్ట్రాలు కేంద్రంకొరకు ఉంటున్నవని బొంబయిలో జరిగిన రాష్ట్ర ఆహారమంత్రుల సమావేశంలో మధ్యప్రదేశ్ మంత్రి శ్రీ రవిశంకర్ శుక్లా అన్నారు.